# రూ. వెయ్యి కోట్లతో నగరాభివృద్ధి



మంత్రి గంగులకు బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళలు

- సమైక్య పాలనలో ఒక్క రూపాయి ఇవ్వలే
- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్
- కరీంనగర్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు భూమిపూజ

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 30: కరీంనగర్‌ను రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖల మంత్రి గంగుల కమలాకర్ ప్రటించారు. సమైక్య పాలకులు ఒక్కరూపాయి కూడా ఇవ్వకుండా అవహేళన చేశారని ఆరోపించారు. కరీంనగరంలోని 9, 10, 11, 32, 46, 48, 49, 21 డివిజన్లల్లో పర్యటించారు. ₹133 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. సీతారాంపూర్ సాయి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. కోతిరాంపూర్ చౌరస్తా నుంచి గిద్దెపెరుమాండ్ల దేవాలయం వరకు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సమస్యలపై వినతిపత్రం ఇచ్చిన మహిళలతో ముచ్చటించారు. 'కరీంనగర్ ఎలా ఉన్నది..రోడ్లు బాగున్నాయా..డ్రైనేజీలో ఎలా ఉన్నాయి..' అని అడిగారు. దీనికి వారు రోడ్లు బాగున్నాయని, డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉన్నాయని సమాధానం ఇవ్వడంతో మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలనీమహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందించే లక్ష్యంతో పని చేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ రాకముందు కరీంనగర్ ఎలా ఉండేదో ఇప్పుడు ఎలా ఉన్నదో ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాత నగరంలో 220 కిలోమీటర్ల రోడ్లను, 147 కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. ప్రపంచస్థాయి పర్యాటకులను ఆకర్షించేందుకు నగరాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కేబుల్ బ్రిడ్జ్ అందుబాటులోకి రాగా, మానేరు రివర్ ఫ్రంట్ ను ఏడాదిలోగా పూర్తి చేస్తామన్నారు. మన పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే కరీంనగర్ ఇంకా అభివృద్ధి చెందాల్సినా అవసరం ఉందన్నారు. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బల్దియా కమిషనర్ ప్రపుల్‌దేశాయ్, నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్

# విజయం మనదే

- మనమందరం బీఆర్ఎస్ కుటుంబసభ్యులం
- సమన్వయంతో ముందుకెళ్దాం
- కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చూద్దాం
- చల్మెడను అఖండ మెజార్టీతో గెలిపిద్దాం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, (నమస్తే తెలంగాణ)/ వేములవాడ, సెప్టెంబర్ 30: 'మనమంతా బీఆర్ఎస్ కుటుంబసభ్యులం.. సమన్వయంతో ముందుకెళ్తే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం మనదే' అంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ కార్యకర్తలను కార్యోన్ముఖులను చేశారు. మూడోసారి ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను చూద్దామని, వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును అఖండ మెజార్టీతో గెలిపిద్దామని పిలుపునిచ్చారు. నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన సైనికుల్లా పనిచేసే కార్యకర్తలు బీఆర్ఎస్‌లో ఉన్నందుకు మనందరం గర్వపడాలన్నారు. శనివారం వేములవాడ సంగీత నిలయంలో ఎమ్మెల్యే రమేశ్‌బాబు అధ్యక్షతన రెండు వేల మంది ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. చల్మెడను గెలిపించి మన ఐక్యతను చాటుతామని తీర్మానం చేశారు. ఆయన లక్ష్మీనర్సింహారావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గంలో చెన్నమనేని రమేశ్‌కు ప్రజల సంపూర్ణ మద్దతు ఉన్నదని, సీఎం కేసీఆర్ అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలని అనేక సార్లు ప్రస్తావించేవారని చెప్పారు. అయితే, కొన్ని ప్రత్యేక కారణాలతో అభ్యర్థిని మార్చామని చెప్పారు. ఎమ్మెల్యే కూడా సమ్మతించారని, ఆయన ఏ ఒక్కరిపై విమర్శలు చేయకపోవడం మంచితనానికి నిదర్శనమన్నారు. బీఆర్ఎస్‌లో గ్రూపు రాజకీయాలు లేవన్నారు. ఎన్నికలు తరుముకొస్తున్న తరుణంలో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఐక్యంగా పనిచేసి వేములవాడ గడ్డపై గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఇది బీఆర్ఎస్ కంచుకోట అని, ఇక్కడ కారు జోరు కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను తీసుకెళ్లాల్సిన బాధ్యత శ్రేణులపై ఉందన్నారు. కేసీఆర్ మల్కపేట రిజర్వాయర్‌కు చెన్నమనేని రాజేశ్వర్‌రావు పేరు పెడతామని ప్రకటించడం మనందరికీ గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మాజీ మార్క్‌ఫెడ్ చైర్మన్ లోకబాపురెడ్డి, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### వేములవాడ గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా



వేములవాడ గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా.. చెన్నమనేని రాజేశ్వరావు ఈ ప్రాంతంలో ఆరుసార్లు గెలిచారు. తదనంతరం కాలం తనను నాలుగుసార్లు ఎమ్మెల్యేగా దీవించి అసెంబ్లీకి పంపించారు. ఇదే స్ఫూర్తితో బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుకు అఖండ విజయం కట్టబెట్టాలి. తాను ఎమ్మెల్యేగా ఉన్నాలేకున్నా ఈ ప్రాంత అభివృద్ధికి పాటుపడతా. కార్యకర్తలకు అందుబాటులో ఉంట. మున్ముందు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. మన మందరం కలిసికట్టుగా వేములవాడ గడ్డపై గులాబీజెండా ఎగురవేద్దాం. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేద్దాం.

**- చెన్నమనేని రమేశ్‌బాబు ఎమ్మెల్యే**

### వేములవాడపై గులాబీ జెండా ఎగురవేద్దాం



వేములవాడ నియోజకవర్గంలో నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలు ఉన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు నియోజకవర్గ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేశారు. విరివిగా నిధులు తెచ్చి ఆదర్శంగా నిలిపారు. రాబోయే రోజుల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరం ఉన్నది. వేములవాడ గడ్డపై గులాబీ జెండా ఎగురవేద్దాం. చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపిద్దాం.. మూడోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసుకుందాం.

**- తోట ఆగయ్య (బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు)**

### రమేశ్‌బాబు అడుగుజాడల్లోనే అభివృద్ధి..



సిట్టింగ్ ఎమ్మెల్యేలకు ఆదరణ ఉన్న నియోజకవర్గాల్లో వేమలవాడ నియోజకవర్గం మొందటి జాబితాలో ఉన్నది. అభ్యర్థుల ప్రకటన సందర్భం గా సీఎం కేసీఆర్ మొదట ప్రస్తావించింది మన ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేరునే. అరవై ఏండ్లుగా చెన్నమనేని కుటుంబానికి ఇక్కడి ప్రజలతో అనుబంధం ఉన్నది. ఈ గడ్డ ఆ కుటుంబానికి అడ్డ. అయితే కొన్ని ప్రత్యేక కారణాలతో అభ్యర్థి మా ర్పు జరగడంతో ప్రజల్లో భావోద్వేగాలు ఉండడం సహజమే. ఎమ్మెల్యే రమేశ్‌బాబు సలహాలు, సూచనల మేరకు ముందుకెల్దాం. ఈ విషయం లో మరో ఆలోచన లేదు. సీఎంగా కేసీఆర్‌ను, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉన్నది. ప్రతిపక్షాల అబద్ధాలను ఎండగట్టా లి. తప్పుడు హామీలపై ప్రజలను అప్రమత్తం చే యాలి. తనను గెలిపిస్తే ఎమ్మెల్యే రమేశ్‌బాబు అ డుగుజాడల్లో ముందుకెళ్తా. ఆయన సహకారంతో నిధులు మంజూరు చేయించి అభివృద్ధి చేస్తా.

**- వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు**

# కరీంనగర్‌లో క్రీడా సందడి



మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్న కరీంనగర్ జట్టు

- అట్టహాసంగా రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు
- 33 జిల్లాల నుంచి 1200 మంది క్రీడాకారులు, కోచ్‌లు, అఫీషియల్స్ హాజరు
- మొదటిసారిగా ఫొటో ఫినిష్ టెక్నాలజీతో పోటీల నిర్వహణ
- నేటితో ముగియనున్న పోటీలు
- ప్రతిభ చాటితే సౌత్‌జోన్‌కు ఎంపిక

కొత్తపల్లి, సెప్టెంబర్ 30 : కరీంనగర్ జిల్లా కేంద్రంలో క్రీడా సందడి నెలకొంది. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 9వ తెలంగాణ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరుగుతున్న ఈ పోటీల్లో రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు, 66 మంది కోచ్‌లు, మేనేజర్లు, 45 మంది టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొంటున్నారు. ఉజ్వల పార్క్ సమీపంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాల ఈ పోటీలకు వేదికైంది. అండర్–14, 16, 18, 20 సంవత్సరాల లోపు బాల బాలికలకు, పురుషులు, మహిళలకు ఈ క్రీడలు నిర్వహిస్తున్నారు. పోటీల మొదటిరోజు 20, 10, 5వేల మీటర్ల రేస్‌వాక్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, డిస్కస్‌త్రో, హైజంప్, 100 మీటర్ల రన్నింగ్, 100 మీటర్ల హర్డిల్స్ తదితర పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులను అందజేశారు. కరీంనగర్‌లో సింథటిక్ ట్రాక్ ఏర్పాటు చేయడంతోనే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్ చాంపీయన్‌షిప్ పోటీలను నిర్వహించే అవకాశం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌కు దక్కింది. బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ ఎంపీగా ఉన్న సమయంలో ఖేలో ఇండియా పథకంలో భాగంగా ఈ ట్రాక్‌ను మంజూరు చేయించారు. కాగా, పోటీల నిర్వహణలో ఖచ్చితత్వం కోసం మొదటిసారిగా అంతర్జాతీయ స్థాయిలో ఫొటో ఫినిష్ టెక్నాలజీని ఈ పోటీల్లో వినియోగిస్తున్నారు. ఈ టెక్నాలజీతో క్రీడాకారుల ప్రతిభను సెకన్లతో ఈ కెమెరా క్యాప్షర్ చేయనుంది. కాగా, సాయంత్రం అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీలను సీపీ సుబ్బారాయుడుతో కలిసి కలెక్టర్ బీ గోపి ప్రారంభించారు. ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పాల్గొననున్నారు. పోటీలు రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్టాన్లీ జోన్స్, సారంగపాణి, జిల్లా క్రీడల అభివృద్ధికి అధికారి రాజవీరు, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి నిర్వహణలో సాగుతున్నాయి.

## ఆర్టీసీ డీఆర్‌ఎం బదిలీ

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 30 : టీఎస్ ఆర్టీసీ కరీంనగర్ రీజియన్ పరిధిలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ (అపరేషన్స్)గా పని చేస్తున్న చందర్‌రావు హైదరాబాద్ బస్ భవన్‌కు బదిలీ అయ్యారు. కాగా, కరీంనగర్ జోనల్ వర్క్ షాపులో స్టోర్స్ ఆఫీసర్‌గా పని చేస్తున్న భూపతిరెడ్డిని కరీంనగర్ రీజినల్ మేనేజర్ (అపరేషన్)గా బదిలీ చేశారు. ఈ మేరకు సంస్థ ఉన్నతాధికారులు శనివారం సాయంత్రం ఆదేశాలు జారీ చేశారు.

# ఐటీఐ దరఖాస్తుల ఆహ్వానం

- ఈనెల 8వరకు అవకాశం

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 30: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎస్ కవిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు అక్టోబర్ 1 నుంచి 8వ తేదీలోగా https://iti.telangana. gov. in వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసుకోవాల ని సూచించారు. నమోదు చేసుకున్న అభ్యర్థులు తప్పనిసరిగా అప్లికేషన్ ప్రింటెడ్ కాపీ, అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఐటీఐలలో వాక్–ఇన్ అడ్మిషన్లకు హాజరు కావాలని చెప్పారు. వారికి అక్టోబర్ 9న ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఇది వరకు నమోదు చేసుకున్న విద్యార్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇప్పటికే సీటు కేటాయించిన విద్యార్థులకు అవకాశం లేదని స్పష్టం చేశారు.